మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



### జనగణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి
#### -కళా ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించిన కళాకారులు

**గజ్వేల్, మే 18 (ప్రభాతవార్త):** జనగణన వివరాల సేకరణకు ఇంటికివచ్చే ఎన్యుమరేటర్లకు కుటుంబ సభ్యుల వివరాలు, నివాస పరిస్థితుల వివరాలను వివరించి సహకరించాలని విజ్ఞాన సాంస్కృతిక సారథి కళాకారులు కళా ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్, ప్రధాన గణన అధికారి కె.హైమావతి ఆదేశాల మేరకు సోమవారం పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి, అర్బన్‌కాలనీలో కళాకారులు ప్రచార రథంతో భారత జనగణన 2027 ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సంక్షేమం, ప్రాంతీయ అవసరాల గుర్తింపు, దేశ భవిష్యత్ ప్రణాళిక, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన, జనాభా వివరాలతోనే సాధ్యమవుతుందని కళాకారులు ఆట పాటలు, కళా ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ కళాకారులు పిల్లిట్ల శ్యామ్‌సుందర్, నసువాల కనకయ్య, గెంటె హరిప్రసాద్, తండ బిక్షపతి, పిన్నింటి రత్నం, పన్నీరు శ్రీనివాస్, ఎల్ల సిద్దులు, రాచపల్లి శైలజ, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

### బెస్ట్ డెలిగేట్‌గా విద్యార్థిని పూజశ్రీకి రాష్ట్రస్థాయి అవార్డు

**అల్లాదుర్గం, మే 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముస్లాపూర్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని పూజశ్రీ రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మునెస్కో కమిటీలో బెస్ట్ డెలిగేట్‌గా అవార్డును అందుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ తెలిపారు. తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషనల్ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో 3 రోజులు ఘనంగా నిర్వహించారు. మెదక్ జిల్లా నుంచి ముస్లాపూర్ పాఠశాల విద్యార్థిని పూజిత యునెస్కో కమిటీలో టర్కీ దేశం తరఫున ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రా స్థాయి అవార్డుకు ఎంపికై ఎంఆర్‌ఎస్ ఎంపి రాధరెడ్డి, సెక్రటరి టు టోర్ ఆఫ్ గవర్నర్స్ యూపీఎస్సీల చేతుల మీదుగా విద్యార్థిని పూజశ్రీ అవార్డు అందుకున్నదని చెప్పారు. అవార్డు అందుకున్న పూజశ్రీని ప్రధానోపాధ్యాయులు రమేష్,గౌడ్ టీచర్ సంతోష్, ఉపాధ్యాయులు అభినందించారు.

# ఎస్ఐహెచ్ఎంకు పూర్వ వైభవం తీసుకొస్తాం

**పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



మాట్లాడుతున్న రాష్ట్ర ఎక్సైజ్ టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**జహీరాబాద్, మే 18 (ప్రభాతవార్త):** జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(ఎస్ఐహెచ్ఎం) సంస్థను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఎస్ఐహెచ్ఎంలో నిర్వహించిన పర్యాటక వారోత్సవాలను మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నూతనంగా ప్రవేశపెట్టిన బేకరీ,కన్ఫెక్షనరీ కోర్సులను మంత్రి ప్రారంభించారు. అలాగే నిథమ్ విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ,ఎంబీఏ కోర్సుల అడ్మిషన్లను లాంఛనంగా ప్రారంభించి, పర్యాటక శాఖ రూపొందించిన టూరిస్ట్ గైడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, సుదీర్ఘ కాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెచ్ఎంను తిరిగి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎస్ఐ హెచ్ఎంలో చేరే పేద విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గించేలా స్టైఫండ్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పర్యాటక, హాస్పిటాలిటీ రంగాల్లో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు కేవలం కోర్సులకే పరిమితం కాకుండా భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, విదేశీ భాషలను నేర్చుకోవాలని మంత్రి సూచించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక కోర్సులను కరిక్యులమ్‌లో చేర్చాలని నిథమ్ డైరెక్టర్ వెంకట రమణకు ఆదేశించారు. పిల్లలు ఉపాధి ఆధారిత కోర్సులు అభ్యసించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, మాజీ మంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్‌లు, అధికారులు,



కందిలో వడ్ల కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

### ధాన్యం కొనుగోలులో రైతులకు అండగా ఉండాలి
#### -సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**కంది, మే 18, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఎస్‌పి పరితోష్ పంకజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్రం నిర్వాహకులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనులు చేస్తూ అప్రమత్తంగా ఉండాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. పోలీసు శాఖ తరపున అన్ని రకాల భద్రతా ఏర్పాట్లకు సిద్దంగా ఉన్నామని ఎస్‌పి పరితోష్ పంకజ్ తెలిపారు. అవసరాలను అనుసరించి రావాణ వాహనాలు అందుబాటులో ఉండేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఇతర రాష్ట్రాలకు చెందిన ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్రంలో విక్రయించకుండా చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి పరితోష్ పంకజ్ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సిఈఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అలియాబాద్‌లో...**

**కొండాపూర్, మే 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అలియాబాద్ గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు అండగా నిలుస్తూ అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పోలీస్ శాఖ తరఫున అన్నిరకాల భద్రతా ఏర్పాట్లకు సిద్ధంగా ఉన్నామని ఎస్పీ తెలిపారు. అవసరాన్ని బట్టి రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో సౌమ్యశ్రీ, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలగవద్దు
#### జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మహాదేవ్ రైస్‌మిల్‌లో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

**రామాయంపేట, మే 18, ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరుగుద్దని జిల్లా అదనపు కలెక్టర్ ఎం. నగేష్ అన్నారు. రామాయంపేట మండలం కోనాపూర్‌లోఉన్న నాగేంద్ర, మహాదేవ్ రైస్‌మిల్లులను అదనపు కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం అన్‌లోడింగ్‌ను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తిచేయాలని, మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లర్లు హమాలీల సంఖ్య ను పెంచి, వెంట వెంటనే ధాన్యం అన్ లోడింగ్ చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తనిఖీలో స్థానిక తాసిల్దార్ రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణిలో 14 దరఖాస్తులు స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి

**నారాయణఖేడ్, మే 18 ప్రభాతవార్త :** నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఉమాహారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 14 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లు, ఇరిగేషన్,వ్యవసాయ, ఆరోగ్య, వైద్య, విద్య, సివిల్ సప్లైస్, సోషల్ వెల్ఫేర్ తదితర శాఖల అధికారులు పాల్గొని, ప్రజల నుండి స్వీకరించబడిన వినతులను పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులు స్వీకరించిన వినతులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఉమాహారతి ఆదేశించారు.

### ప్రజావాణిలో డిబిఎఫ్ నాయకుల వినతి

**గజ్వేల్ టౌన్, మే 18 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం బెజుగామ గ్రామానికి చెందిన మాల కులస్తులకు అంబేద్కర్ భవనం కేటాయించాలని, కోమటిబండ గ్రామానికి చెందిన దళిత మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సోమవారం గజ్వేల్ ప్రజావాణిలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెజుగామ మాల కులస్తులకు అంబేద్కర్ భవనం కేటాయించాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, మరో సారి ప్రజావాణి ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లి భవనం మంజూరుకు సహకరించాలని కోరారు. కోమటిబండ గ్రామానికి చెందిన దళిత మహిళకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు రాక ఇబ్బందులు ఎదుర్కొంటుందని, రెండవ విడతలోనైనా ఇల్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధు, ప్రవీణ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి, చిత్రంలో గూడూరి శ్రీనివాస్

### ప్రతి రైతుకి నాణ్యమైన విత్తనాలను అందించాలి
#### రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

వచ్చే ఖరీఫ్‌లో ప్రతి రైతుకి నాణ్యమైన విత్తనాలను అందించాలని.. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ అందించే విత్తనాలను కొనుగోలు చేయాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి విత్తన డీలర్లకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ జిల్లాలోని అగ్రోస్,సహకార సంఘాలు, ప్రైవేటు డీలర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.వచ్చే వానకాలం సీజన్‌లో నకిలీ విత్తనాలు అమ్మకుండా రైతులు పంటల మార్పిడి సంబంధించి సలహాలు సూచనలు అందించడానికి సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. వ్యవసాయానికి అతి కీలకం విత్తనం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి విత్తన అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. ఈ సంస్థ ప్రయోగశాలలో పరిశోధన చేసిన విత్తనాలను మాత్రమే రైతుకు అందిస్తుందన్నారు.

మేలిరకమైన, నాణ్యమైన విత్త నాలు రైతులకు లాభం కలుగుతాయన్నారు. ఎక్కడైనా రైతుకు నకిలీ విత్తనాలు, ఎరువులు అందజేస్తే అమ్మిన డీలర్‌తో పాటు తయారు చేసిన కంపెనీల వారిని శిక్షించేలా చట్టం తీసుకరావడం జరుగుతుందన్నారు. విత్తనాలు కొనుగోలుచేసే సమయంలో రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. విత్తనా లను అక్రమ రవాణా చేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. డిమాండ్ ఉన్న పంటను వేయాలని పంట మార్పిడి విధానంలో రైతులను ప్రోత్సహించాలన్నారు.

### రైతులకు లాభం చేకూర్చే విత్తనాలు అందజేయాలి
#### రాష్ట్ర పద్మశాలి, కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్

రాష్ట్రంలో రైతుల సమస్యలను పరిష్కరించడంతో విత్తనాభివృద్ధి సంస్థ పనిచేస్తుందని రాష్ట్ర పద్మశాలి, కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ అన్నారు.ప్రభుత్వం అందజేస్తున్న విత్తనాలను అమ్మడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డీలర్లకు సూచించారు. రైతుకు లాభం చేకూర్చే విత్తనాలు, ఎరువులను అందజేయాలన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రేవంత్‌రెడ్డి సర్కార్ ముందుకు సాగుతుందన్నారు. అనంతరం తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ జారీ చేసిన గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీడ్ కార్పొరేషన్ రీజనల్ మేనేజర్ అతుల్ జైన్‌కుమార్, డిఏఓ స్వరూపరాణి, డిసిఓ వరలక్ష్మి, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

### పర్యాటక కేంద్రంగా ముత్తంగి ఎంక చెరువు : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, మే 18, ప్రభాతవార్త :** ముత్తంగి డివిజన్ పరిధిలోని ఎంక చెరువును 7 కోట్ల 60 లక్షల రూపాయలతో సుందరీకరణ చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్ఎండిఏ అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. స్వయంగా చెరువు కట్టపై ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో గల ఎంక చెరువును పర్యటకంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంతో హెచ్ఎండిఏ ద్వారా 7 కోట్ల 60 లక్షల రూపాయలు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా కట్ట అభివృద్ధితోపాటు బతుకమ్మ ఘాట్, లైటింగ్, వాకింగ్ ట్రాక్, హైమాస్ట్ లైటింగ్, గార్డెనింగ్, తదితర పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని, మరో రెండు నెలల్ల పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని హామీ ఇచ్చారు. ఇస్నాపూర్ ప్రజలు సైతం చెరువు కట్ట పైకి సులభంగా చేరుకునేందుకు కనెక్టింగ్ బ్రిడ్జి నిర్మించనున్నట్లు తెలిపారు. ముత్తంగితో పాటు ఇస్నాపూర్, పాశమైలారం, చిట్కుల్, లకడారం గ్రామాల ప్రజలకు ఆహ్లాదకరమైన చెరువు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పటాన్ చెరు లోని సాకి చెరువు, తిమ్మక్క చెరువు, దోషం చెరువులను సైతం పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ డీఈ రామారావు, మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, కుమార్ గౌడ్, ప్రభాకర్, కిట్టు, శ్రీనివాస్ రెడ్డి, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, అబేద్, రవి, తదితరులు పాల్గొన్నారు

### కొనుగోలు కేంద్రంలో రైతుల ధర్నా

**కొల్చారం మే 18 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రం వద్ద తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు లారీలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్ ఆరోపించారు. సోమవారం రైతులు నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో కేంద్రాలవద్ద భారీగా బస్తాలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, అకాల వర్షాల భయంతో ధాన్యం తడిసి నష్టపోతుందనే ఆందోళన రైతుల్లో నెలకొందని చెప్పారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో ఆగ్రహించిన పోతంశెట్టిపల్లి గ్రామ రైతులు మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. వెంటనే లారీలను పంపించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. సమాచారం అందుకున్న కొల్చారం ఎస్సై మహమ్మద్ మొయినుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ నాయిని సిద్ధిరాములు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో సుమారు 3,500 ధాన్యం బస్తాలు ఐదు రోజులుగా పేరుకుపోయి ఉన్నాయని తెలిపారు. లారీ యూనియన్ ప్రతినిధులను సంప్రదిస్తే రూ.17 వేల నుంచి రూ.20 వేల వరకు చెల్లిస్తేనే లారీలను పంపిస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి లారీలను పంపించి ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# రా రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలోని రా రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించి ఒకటిన్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దించుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని రా రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈసారి రబీ సీజన్‌లో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం పండిందని, దీంట్లో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఇప్పటికే 1 లక్షా 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, ఈనెల 19 లోగా 20 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని తెలిపారు. వాతావరణం అనుకూలించి అధికంగా ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. జిల్లాలోని రా రైస్ మిల్లర్లు 40 శాతం కెపాసిటీతో మొత్తం 1 లక్షా 50 వేట మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని సూచించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో అధిక శాతం సన్న రకం వరి ధాన్యాన్ని రైతులతో పండించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులను మోటివేట్ చేస్తున్నామని మిల్లర్లు రైతులకు సన్న రకం ధాన్యాన్ని పండించడంపై చైతన్యం తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్ఏ జి.తనూజ, మేనేజర్ గోపి కృష్ణ, రా రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

**22న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై సమావేశం**

ఈనెల 22న జిల్లా కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లాస్థాయి సమావేశం నిర్వహించడానికి సిద్ధం చేయాలని కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఏర్పాట్లపై ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రజలను ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం పెంచేందుకు ఉద్దేశించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ఇప్పటికే గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి సమావేశాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ నెల 22న నిర్వహించే జిల్లా స్థాయి సమావేశానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు.



వర్షానికి తడుస్తున్న వడ్లు

### అకాల వర్షంతో తడిసిన ధాన్యం

**చిలిపిచెడ్, మే 18 ప్రభాతవార్త :** గాలి వానతో.. కొనుగోలు కేంద్రాల్లో నానిన వరి ధాన్యం చిలిపిచెడ్ మండలంలోని పలు గ్రామాలలో సోమవారం సాయంత్రం గాలివానతో కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొన్నిరోజులుగా కొనుగోలు కేంద్రాలకు లారీలు రాకపోవడంతో ధాన్యం తూకం జరగడం లేదు.దీంతో అజ్జమరి, చిట్కుల్ ఫైజాబాద్, గంగారాం, గౌతపూర్, తదితర గ్రామాలలో దాన్యం కుప్పలు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి. తూకం వేసిన బస్తాలు సైతం రైస్ మిల్లులకు తరలించకపోవడంతో కొనుగోలు కేంద్రాలని ఉండిపోయాయి. సోమవారం సాయంత్రం సమయంలో కురిసిన అకాల వర్షాలకు తూకం వేసిన ధాన్యం బస్తాలు ఆరబోసిన ధాన్యం కుప్పంలోకి వరద నీరు చేరడంతో ధాన్యం తడిసిపోయాయి. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని తుకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా అధికారులు చర్యలు చేపట్టాలని మండలంలోని వివిధ గ్రామాల రైతుల కోరుతున్నారు.

### ఈతకు వెళ్లి ముగ్గురు బాలురు మృతి

**జహీరాబాద్, మే 18 ప్రభాతవార్త :** రాయికోడ్ మండలం పీపాడ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రామోజిపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం విషాద ఘటన చోటుచేసుకుంది. ఈతకు వెళ్లిన ముగ్గురు బాలురు నల్లవాగులో మునిగి మృతి చెందారు. రాయికోడ్ ఎస్సై చైతన్య కిరణ్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన రాయిపల్లి చంద్రయ్య కుమారుడు నిరంజన్(12), మున్నూరు కాపు బసవరాజ్(10), మున్నూరు కాపు మనోజ్ ఈత కొట్టేందుకు గ్రామసమీపంలోని నల్లవాగుకు వెళ్లారు. అయితే సాయంత్రం వరకు పిల్లలు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వాగు వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ పిల్లల బట్టలు, చెప్పులు కనిపించడంతో వారు నీటిలో మునిగిపోయి ఉండవచ్చని అనుమానించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజఈతగాళ్ల సహాయంతో వాగులో గాలింపు చేపట్టారు. అనంతరం ముగ్గురు బాలుర మృతదేహాలను వెలికి తీశారు. చిన్నారుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కన్న బిడ్డలు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

**చిన్నశంకరంపేట, మే 18, ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిన్నశంకరంపేటలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం... మండల పరిధి సూరారం గ్రామానికి చెందిన ప్రసాద్ ఐశ్వర్య(30) దంపతులు. కూలీ పనులు చేసుకుంటున్నారు. ప్రసాద్ గతంలో మాసాయిపేట గ్రామానికి చెందిన లావణ్యతో వివాహం కాగా కుటుంబకలహాల నేపథ్యంలో పెద్దల సమక్షంలో విడిపోయారు. 8 నెలల క్రితం నార్సింగి పట్టణానికి చెందిన ఐశ్వర్యను ప్రసాద్ వివాహం చేసుకొని చిన్నశంకరంపేటలో నివాసం ఉంటున్నాడు.గతంలో ఐశ్వర్యకు బీహార్‌కు చెందిన వ్యక్తితో వివాహం కాగా గొడవల వలన విడిపోయారు. ప్రసాద్ మొదటి భార్య ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రసాద్‌కు తరచూ సందేశాలు పంపడంతో, గమనించిన ఐశ్వర్య ఆదివారం రాత్రి ప్రసాద్‌తో గొడవ పడింది. విషయం తెలుసుకున్న ఐశ్వర్య అక్క మౌనిక ఇద్దరిని సముదాయించింది. ప్రసాద్ ఇంటినుండి వెళ్లిన కొద్దిసేపటికి ఐశ్వర్య ఇంటి తలుపులు వేసుకొని ఎంతకి తీయకపోవడంతో కిటికిలో నుంచి గమనించగా ఐశ్వర్య ఉరేసుకొని ఉన్న విషయాన్ని గమనించిన ప్రసాద్ స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి ఐశ్వర్యను అంబాజీపేటలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి అక్క మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

### వ్యక్తి ప్రాణం తీసిన మెట్ల పంచాయితీ

**సిద్దిపేట అర్బన్, మే 18, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మందపల్లిలో మెట్ల పంచాయతీ ఒక వ్యక్తి ప్రాణం తీసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ ఉపేందర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన జిందం సిద్దిరాములు(67) ఇంటికి వెళ్లేదారిలో సీసీరోడ్డుపై తన దాయాదులు జిందం తిరుపతి కుటుంబ సభ్యులు నాలుగు నెలల క్రితం వాళ్ల ఇంటి మెట్లు నిర్మించారు. దీంతో ఆ రోడ్డు దారి చిన్నగా మారడంతో పాటు వ్యవసాయ పనులకు ఉపయోగించే ట్రాక్టర్ ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని సిద్దిరాములు గ్రామంలోని పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా మెట్లను కూల్చివేయాలని నిర్ణయించి పంచాయతీ కార్యదర్శి భవానికి లేఖను అందజేశారు. ఆమె నుంచి స్పందన రాకపోవడంతో డిపివోపాటు కలెక్టరేట్‌లో సిద్దిరాములు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. వారు సైతం అక్రమంగా ఉన్న మెట్లను తొలగించాలని చెప్పినా మెట్లను కార్యదర్శి కూల్చివేయకపోవడంతో సిద్దిరాములు, తిరుపతి కుటుంబ సభ్యులకు గోడవలు జరుగుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో ఈనెల 15న రెండు కుటుంబాల మధ్య పెద్దఎత్తున గొడవ జరగడంతో మనస్థాపానికి గురైన సిద్దిరాములు 16న వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగినట్లు తెలిపారు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం మృతిచెందాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు జిందం రాజశేఖర్, తిరుపతి, కుంటయ్య, దేవవ్వలోత పాటు కార్యదర్శి సామల భవానిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

### పిడుగుపాటుకు ఆవు మృతి



మృతి చెందిన ఆవు

**చిలిపిచెడ్, మే 18 ప్రభాతవార్త :** పిడుగుపాటుకు ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని చండూర్ గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ధాటికి పడిన పిడుగుపాటుకు చండూర్ గ్రామానికి చెందిన తలారి లచ్చయ్యకు చెందిన ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో బాధితులు బోరున విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

# బయోకాన్‌లో భద్రతపై మాక్ డ్రిల్

### -నిశితంగా పర్యవేక్షణ చేసిన అదనపు కలెక్టర్ పాండు, అడిషనల్ ఎస్పీ చైతన్యరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

**పటాన్‌చెరు, మే 18, ప్రభాతవార్త:** పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించిన సమయాలలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో సన్నద్ధతను తెలుసుకునేందుకు వీలుగా సోమవారం సంగారెడ్డిజిల్లాలోని బయోకాన్ లిమిటెడ్ పాశమైలారంలో చేపట్టిన మాక్ ఎక్సర్‌సైజ్ విజయవంతంగా పూర్తయింది. సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండు, అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్ జిల్లా యంత్రాంగం అన్నివిధాలుగా సమాయత్తం అయి ఉందన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా తెలిపింది. విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు వాస్తవికతను తలపించేలా ఉన్నాయి. అన్నిశాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, పారిశ్రామిక ప్రమాదాల సమయాలలో ఏవిధంగా వ్యవహరించాలన్నది ఆచరణాత్మక రూపంలోచేసి చూపించారు. అంబులెన్స్‌లు, అగ్నిమాపక శకటాలు, వైద్యబృందాలు, పోలీస్, రెవిన్యూ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేపట్టిన సహాయక చర్యలు విపత్తుల నిర్వహణపై సన్నద్ధతను చాటి చెబుతూ ప్రజల్లో, పరిశ్రమ కార్మికుల్లో నమ్మకాన్ని పెంపొందింపజేశాయి. ఆయా శాఖల అధికారులతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందం మాక్ డ్రిల్ విజయవంతానికి దోహదపడ్డాయి. పోలీస్, ఫైర్, రెవెన్యూ, హెల్త్, విద్యుత్, పరిశ్రమలు తదితర అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ మాక్ ఎక్సర్‌సైజ్‌ను విజయవంతం చేశారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో అప్రమత్తతతో నష్టాన్ని నివారించవచ్చని అన్నారు. అన్నిశాఖల అధికారులు, కంపెనీ యాజమాన్యం, ఎన్డీఆర్ఎఫ్, ఉద్యోగుల సమన్వయంతో మాక్ డ్రిల్ విజయవంతమైందన్నారు. అడిషనల్ ఎస్పీ చైతన్యరెడ్డి మాట్లాడుతూ.. కంపెనీలో ఏర్పాటు చేసిన ఫైర్ ప్రొటెక్షన్ సిస్టమ్ సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. ఏ కంపెనీలోనైనా ప్రమాదం సంభవించిన వెంటనే సంబంధిత అధికారులు పోలీసుశాఖకు సమాచారం అందజేయాలని సూచించారు. అలాగే, కంపెనీ యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలకు వెంటనే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తొలిదశలో వేగంగా స్పందించడం వల్ల ప్రమాద తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని ఆమె తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ఆయాబృందాలు సమన్వయంతో పనిచేయడంవల్ల మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించగలిగామని అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేందర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు, పోలీస్, వైద్య ఆరోగ్య, పరిశ్రమలు, రెవిన్యూ, విద్యుత్‌శాఖల అధికారులు, బయోకాన్‌కంపెనీ ప్రతినిధులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్దే ధ్యేయం

### -ఎన్‌సిసి సంస్థ సహకారంతో అదనపు గదుల నిర్మాణం



గదులను పరిశీలిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, మే 18, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ అన్నారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి సంస్థ ఆర్థిక సహకారంతో సుమారు కోటిరూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న అదనపు అంతస్తు, గదుల నిర్మాణ పనులను సోమవారం ఆయన వార్డు కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యావాతావరణం కల్పించేందుకు మున్సిపాలిటీ ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, వార్డుకౌన్సిలర్లు రమేష్, కుమార్‌గౌడ్, చక్రపాణి, సంజీవరెడ్డి, కిషన్, కో ఆప్షన్ సభ్యులు ఫయాజ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మహేష్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## గుంతపల్లి గ్రామస్థుల ధర్నా



ధర్నా చేస్తున్న దృశ్యం

**కొండాపూర్, మే 18, ప్రభాతవార్త:** గుంతపల్లి గ్రామానికి చెందిన యువకులు, గ్రామపెద్దలు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఐదునెలల క్రితం ఆర్డీఓ, తహసీల్దార్ సమక్షంలో పరిశ్రమ ప్రతినిధులు గ్రామయువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని సోమవారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు మోనిన్ ఇండియా పరిశ్రమ గేటు వద్ద యువకులు, గ్రామపెద్దలు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఉద్యోగాలు, కాంట్రాక్టులు ఇస్తామని ఏడాది నుంచి హామీ ఇస్తూ కాలయాపన చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ధర్నా విషయం తెలుసుకున్న పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ అనిల్ పోలీసులకు సమాచారం అందించడంతో సిఐ సుమన్‌కుమార్, ఎస్ఐ సోమేశ్వరిలు ధర్నావద్దకు చేరుకున్నారు. గ్రామస్థులు, హెచ్‌ఆర్ మేనేజర్‌తో చర్చించి సమస్యలను పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు.

## దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్



వినతిపత్రం అందజేస్తున్న ఔషధసంఘాల సభ్యులు

**చిలిపిచెడ్, మే 18, ప్రభాతవార్త:** అఖిలభారత ఔషధ విక్రయ సంఘాల పిలుపుమేరకు ఈనెల 20వ తేదీ బుధవారం నిర్వహించబోయే దేశవ్యాప్తంగా ఒక్కరోజు మెడికల్ షాప్‌ల బంద్‌ను విజయవంతం చేయాలని కౌడిపల్లి, కొల్చారం, చిలిపిచెడ్ ఏరియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పొన్నం మనోహర్‌గౌడ్ ప్రధాన కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. సోమవారం మూడుమండలాలకు చెందిన తహసీల్దారులకు, ఎస్ఐలకు ముందస్తు సమాచారంలో భాగంగా తోటి కెమిస్ట్‌లతో కలిసి మెమోరాండం అందజేయడం జరిగింది. కార్యక్రమంలో వీరితో పాటు ఏరియా కోశాధికారి వెంకన్న, జిల్లా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సందీప్ కుమార్, కాలేరు శ్రీనివాస్, రాజా గౌడ్, రెడ్యా, ఏరియా సభ్యులు నరసింహ రెడ్డి, హరీష్ రెడ్డి, హరి శంకర్ గౌడ్, అనిల్ కుమార్, ప్రశాంత్, ఆసిఫ్, ప్రేమ్ కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష వైఫల్యం విద్యాకేంద్రీకరణ ఫలితమే

### -ఎర్రోళ్ల మహేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు

**కొల్చారం, మే 18, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకుంటున్న వరుస వైఫల్యాలు, పేపర్ లీక్‌లు, అవకతవకలు భారత విద్యావ్యవస్థలో నెలకొన్న తీవ్రమైన సంక్షోభానికి ప్రతిబింబంగామారాయని, ముఖ్యంగా కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న విద్యాకేంద్రీకరణ, కార్పొరేటీకరణ విధానాలే ఈ పరిస్థితులకు ప్రధాన కారణమని ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ సభ్యులు ఎర్రోళ్ల మహేష్ అన్నారు. ఒకే దేశం – ఒకే పరీక్ష అనే నినాదంతో తీసుకువచ్చిన నీట్‌విధానం రాష్ట్రాల హక్కులను హరించేదిశగా సాగుతోందని. ప్రజాస్వామ్య, సమానత్వ, శాస్త్రీయ విద్యావ్యవస్థ కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు కలిసి పోరాడాల్సిన అవసరం అత్యవసరంగా మారిందని ఎర్రోళ్ల మహేష్ పేర్కొన్నారు.

## ధాన్యం తూకం వేసేలా చర్యలు తీసుకుంటాం

### -నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్, రైతు నాయకులు మిర్యాల చంద్రశేఖర్ తదితరులు

**నర్సాపూర్, మే 18, ప్రభాతవార్త:** రైస్ మిల్లుల వద్ద నిలిచిన లారీల అన్‌లోడింగ్ సమస్యను పరిష్కరించి హమాలీల కొరతను తీర్చి నర్సాపూర్ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకంవేసేవిధంగా చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. సోమవారం ఆయన నర్సాపూర్ మార్కెట్ యార్డును సందర్శించి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఇక్కడ ధాన్యంతో వేచి ఉన్న రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తూకం వేయకపోగా రోజులతరబడి ఈ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నామని రైతులు తెలిపారు. ఈసందర్భంగా తెలంగాణ రైతురక్షణ సమితి మెదక్‌జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ చంద్రశేఖర్ నేతృత్వంలో రైతులు తమగోడును అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాస్ సానుకూలంగా స్పందిస్తూ.. లారీలు, హమాలీలను సరిపడా ఏర్పాటుచేసి, తూకాల ప్రక్రియ వేగవంతం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతురక్షణ సమితి ప్రతినిధి కుమార్‌రెడ్డి, స్థానిక రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఇండోర్ స్టేడియాన్ని ప్రక్షాళన చేయాలి

**గన్‌ఫౌండ్రి, మే 18, ప్రభాతవార్త:** బేగంబజార్ డివిజన్‌లోని విక్టరీప్లే గ్రౌండ్‌ని ఇండోర్ స్టేడియంను ప్రక్షాళన చేయాలని కోరుతూ మహానగర పాలక సంస్థ గోషామహల్ నియోజకవర్గం డిప్యూటి కమీషనర్‌కు ప్రజాపాలనలో భాగంగా వినతిపత్రం అందచేసినట్లు ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బద్దం సతీష్‌గౌడ్ విన్నవించినట్లు తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా క్రీడా వారం సందర్భంగా ప్రక్షాళన చేసి, క్రీడాకారులకు అనుమతి ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో సేవాదళ్ నాయకులు ఇఫ్తేకార్, కమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. కాగా అర్హులైన వారికి ఇందిరమ్మ పథకంలో భాగంగా డబుల్ బెడ్ రూమ్‌లను కేటాయించాలని హైదరాబాద్ జిల్లా ఆర్.డి. ఓను కలిసి వినతిపత్రం అందచేశారు.

## గుంతల మయంగా ఉన్న రోడ్లు పట్టించుకోని ఇంజనీర్లు

**అడ్డగుట్ట, మే 18, ప్రభాతవార్త:** రైల్‌నిలయం అంబేద్కర్‌నగర్‌నుంచి టీచర్స్ కాలనీకి వెళ్లే ప్రధానరోడ్డు మార్గం చెత్త,చెదారంతోపాటు గుంతలమయంగా ఉండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓవైపు డ్రైనేజీ మురుగునీరు నిరంతరం ఏరులై పారడం, గుంతలమయంగా ఉన్న రోడ్లల్లో మురుగునీరు ప్రవహించడంతో వాహనచోదకులపై చిమ్మడం, వాహనాలు ధ్వంసంకావడం, రాకపోకలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

**డీసెల్టింగ్ మట్టి కుప్పలను తొలగించాలి...**

రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో 10రోజుల క్రితం నాలాల్లో పేరుకుపోయిన మట్టిని డీసెల్టింగ్ చేశారు. మ్యాన్‌హోల్స్ పక్కనే మట్టి కుప్పలను మున్సిపల్ ఇంజనీర్లు తొలగించకపోవడంతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈవిషయాన్ని డిప్యూటీ కమిషనర్ డాకూనాయక్, ఏఈ వరుణ్‌దేవ్‌ల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు.

## డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు

**పేట్‌బషీరాబాద్, మే 18, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో 132 జీడిమెట్ల డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం డిప్యూటీ కమిషనర్‌కి వినతి పత్రం అందజేశారు. గాయత్రి నగర్‌లో ఉన్న వార్డ్ కార్యాలయాన్ని ఇటీవల తొలగించడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. జీడిమెట్ల గ్రామం, పేట్ బషీరాబాద్ గ్రామం, పరిసర కాలనీల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వార్డ్ కార్యాలయాన్ని యథావిధిగా తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా నూతనంగా ఏర్పాటు కానున్న జీడిమెట్ల మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని జీడిమెట్ల గ్రామంలోనే ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యవంతంగా అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, బచ్చ జ్ఞానేశ్వర్, కాలే నగేష్, సంపత్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, పోగు సమ్మయ్య నేత, కేపీ వినయ్‌గౌడ్, నదీమ్‌రాయ్, కాలే గణేష్, మస్కూరి పద్మ, యాదగిరి, కవిత తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో త్రాగునీటి సమస్యలు

### -సిపిఐ ఆందోళన

**జీడిమెట్ల, మే 18, ప్రభాతవార్త** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప పోచమ్మ దేవాలయం వద్ద త్రాగునీటి పైపుకు రంధ్రం పడటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు, వాటర్ డిపార్ట్మెంట్ మధ్య సమన్వయం లోపం కారణంగా నీటి సరఫరా నిలిచిపోయిందని ఆరోపిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ బాచుపల్లి మండలకార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల సామాన్య ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రజలకు నీటి సరఫరా అందించాల్సిన వాటర్ డిపార్ట్మెంట్ అధికారులు, రోడ్లు, ఇతర మౌలికవసతుల పనులు చేపట్టే మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. క రోజు నీటి సరఫరా నిలిచిపోయినా ప్రజల నుంచి పూర్తి నెల బిల్లులు వసూలు చేస్తున్నారని, మరి నీళ్లురాని రోజుకు బిల్లులో కోతవిధిస్తారా అని ప్రశ్నించారు. పైపులైన్ పనుల్లో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, లైసెన్సును వెంటనే రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పొన్నకంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమంపై దృష్టి పెట్టాలి: రాథోడ్ సంతోష్

**నిజాంపేట్, మే 18, ప్రభాతవార్త** హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులపై అధికారులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని, అదేస్థాయిలో కార్మికుల సంక్షేమంపై కూడా ప్రభుత్వం దృష్టిపెట్టాలని యూనియన్ నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు రాథోడ్ సంతోష్ అన్నారు. సోమవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిజాంపేట్ సర్కిల్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ, సైబరాబాద్ కార్పొరేషన్‌పరిధిలోని నిజాంపేట్ సర్కిల్‌లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు జీహెచ్ఎంసి స్థాయిలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా కార్మికుల ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌లో ఉండటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్ఎఫ్ఏ కార్మికులు, జవాన్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నిజాంపేట్ సర్కిల్ కార్యదర్శి పి. పెంటయ్య, నాయకులు బాలపీర్, మదిలేటి, చెన్నయ్య, అంజి, బాలస్వామి, నాగలక్ష్మి, మనీ, బుజ్జమ్మ, మధు, రాములు, నరసింహ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## తాగిన మత్తులో ఇరువురి మధ్య ఘర్షణ ఒకరి హత్య

**కంటోన్మెంట్, మే 18, ప్రభాతవార్త:** తాగిన మైకంలో ఇద్దరి స్నేహితుల మధ్య తలెత్తిన వివాదంతో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన మార్కెట్ మోండా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బేగంపేట ఓల్డ్ కస్టమ్ బస్తీకి చెందిన పెద్ద నర్సింహులు,బొట్ల ఉత్తమ్‌లు అనే వ్యక్తులు అడ్డా కూలీలుగా పనిచేస్తున్నారు. అదివారం రాత్రి సికింద్రాబాద్ హరిహర కళాభవన్ సమీపంలోని ఎన్‌టీపీసీ భవనంలోని 5వ అంతస్థులో ఉన్న టెర్రస్ పై ఇద్దరు కలిసి మద్యం సేవిస్తుండగా వారి ఇద్దరి మధ్యలో తలెత్తిన గొడవలో విచక్షన కోల్పోయిన ఉత్తమ్ నర్సింహులుపై ఇనుప రాడ్, బీర్ బాటిల్‌తో తలపై బలంగా కొట్టడంతో నర్సింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య చేసిన ఉత్తమ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో తహశీల్ కార్యాలయాన్ని నిర్మించాలి: సిపిఎం

**అడ్డగుట్ట, మే 18, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ అడ్డగుట్టలో యాభై పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో మారేడ్‌పల్లి తహశీల్ కార్యాలయాన్ని నిర్మించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డి.అర్.ఓ.విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిపిఎం నేత అజయ్ బాబు మాట్లాడుతూ కొందరు భూకబ్జాదారులు ఆస్థలాన్నీ కబ్జా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో తహశీల్ కార్యాలయాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. డి.ఆర్.ఓ.ను కలిసి వారిలో అడ్డగుట్ట సమగ్రాబివృద్ధి,ప్రజా సంక్షేమం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అజయ్‌బాబు, ఆర్.ప్రకాశ్‌లు ఉన్నారు.

## అంతరాష్ట్ర దొంగ అరెస్ట్

### -30లక్షల విలువైన బంగారు అభరణాలు స్వాధీనం

**గోషామహల్, మే 18, ప్రభాతవార్త:** దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్న అంతరాష్ట్ర దొంగను అదుపులోకి తీసుకుని సుమారు 30లక్షల విలువైన బంగారు అభరణాలు, రెండు లక్షలపై నగదును స్వాధీనం చేసుకున్నట్లు గోల్కొండ జోన్ డిసిపి చంద్రమోహన్ తెలిపారు. గోషామహల్ ఎసిపి కె.చంద్రశేఖరరెడ్డి, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్, డి.ఎస్.కె.జగదీశ్వరరావులతో కలిసి సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిసిపి జి.చంద్రమోహన్ మాట్లాడుతూ మహారాష్ట్ర, లాతూరు జిల్లా ఉద్గీర్ గ్రామానికి చెందిన దివంగత యాదవ్ కుమారుడు సోన్‌కాంబ్లే(20) కిషన్‌బాగ్ పరిసర ప్రాంతాలలో నివాసం ఉంటూ వసనాలకు బానిసై దొంగతనాలను చేయడం మొదలు పెట్టాడు. పంక్షన్‌హాళ్లలో జరిగే శుభకార్యంలో వెయిటర్‌గా పనిచేసేవాడు. దీనికి జులాయిగా మారి వచ్చే సంపాదనతో ఖర్చులకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించడానికి దొంగతనాల మార్గాన్ని ఎంచుకున్నాడు. ఇప్పటి వరకు మూడు ఇండ్లలో దొంగతనం కేసులు, ఒక పోక్సో కేసు నమోదైనట్లు డిసిపి చంద్రమోహన్ తెలిపారు. అత్తాపూర్ పి.ఎస్‌లో రెండు కేసులు, బేగంబజార్ పి.ఎస్ పరిధిలో రెండు కేసులు ఉన్నాయి. ఈనెల 6వ తేదిన హిందీనగర్‌లో ఒక ఇంట్లో దొంగతనం జరిగినట్లు బాధితుడు ఎమ్.కృష్ణ బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 235 గ్రాముల బంగారం, పదిలక్షల రూపాయల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సిసి కెమోరాల పుటేజీలను పరిశీలించినట్లు చెప్పారు. అనుమానంతో సోన్ కాంబ్లేను అదుపులోకి తీసుకుని విచారించగా తానే దొంగతనం చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు చెప్పారు. అతనివద్ద 30లక్షల విలువైన 206గ్రాముల బంగారు ఆభరణాలు, 2లక్షల14వేల600 రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసును గోషామహల్ ఎసిపి.కె.చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ భరత్‌గౌడ్, ఆధ్వర్యంలో డి.ఎస్.ఐ కె.జగదీశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు. సకాలంలో కేసును డిటెక్ట్ చేసిన క్రైం సిబ్బందికి క్యాష్ రివార్డు అందచేశారు.

## వేతన సవరణ సంఘానికి వినతి పత్రం అందచేసిన టాప్రా బృందం

**ముషీరాబాద్, మే 18, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నియమించిన 8వ వేతన సవరణ సంఘంకు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్ర) నేతలు పలు ప్రతిపాదనలతో వినతిపత్రం అందచేశారు. సోమవారం హోటల్ మారియట్‌లో 8వ వేతన సవరణ సంఘం వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టాప్ర ప్రతినిధులు కనీస వేతన 69వేలు చెల్లించాలని, వేతన సవరణ ఫిట్‌మెంట్ 3.833గా ఉండాలని, ఉద్యోగులతో సమానంగా పెన్షన్ రివిజన్ చేయాలని, ఎన్‌పిఎస్, యూపిఎస్ పెన్షన్ విధానాలను రద్దు చేసి, పాత డిఫైండ్ పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. ఉద్యోగి చివరి మాస వేతనం, బేసిక్ పేకు 67శాతం సర్వీసు పెన్షన్, 50శాతం కుటుంబ పెన్షన్ మంజూరు చేయాలని, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫారస్ ప్రకారం 65 సంవత్సరాల వయసు నుంచి ప్రతి సంవత్సరం అదనపు పెన్షన్ 5 శాతం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూటేషన్ రెస్టొరేషన్ పిరియడ్‌ని 15 సంవత్సరాలు నుంచి 11 సంవత్సరాలకు తగ్గించాలని, సీనియర్ సిటి జన్లకు రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలని, 80సంవత్సరాల సూపర్ సీనియర్ సిటిజన్లకు కేర్ టేకర్ అలవెన్స్‌లు మంజూరు చేయాలని, పెన్షనర్ మరణించిన పుడు అంత్యక్రియల నిమిత్తం 50వేల రూపాయలు చెల్లించాలని కోరుతూ, వేతన సవరణ సంఘం సభ్యులకు వినతి పత్రం అందచేశారు.

ఈ కార్యక్రమంలో టాప్ర గౌరవ అధ్యక్షులు ఎం.ఎస్.రెడ్డి, సి.జి.కన్వీనర్ రామచంద్రుడు, సభ్యులు ప్రభాకర్, వి.కృష్ణమోహన్, జి. అశోక్, ఎం.అర్జున్, భార్గవాచారి పాల్గొన్నారు.

## కె.కె.కమిటీలో ఉద్యమ సంఘాల నాయకుల పేర్లు ప్రకటించాలి : సుల్తాన్ యాదగిరి

**అడ్డగుట్ట, మే 18, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని టీ యూజేఏసి చైర్మన్ సుల్తాన్ యాదగిరి హెచ్చరించారు. సోమవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన టీయూ జేఏసి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమకారులకోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కె.కె.కమిటీలో తెలంగాణ ఉద్యమకారుల సంఘాల పేర్లను చేర్చాలన్నారు. వచ్చే నెల 2లోపు తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉదృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసి నాయకులు మోత్కూరి మల్లేశ్, జి.యాదగిరి,స్యామ్యేల్, వనజ లక్ష్మి, మణెమ్మ, వెంకట్ లక్ష్మణ్, కమలా, స్వరూప,శ్యామ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత మీ సురక్ష : డిసిపి

**కంటోన్మెంట్, మే 18, ప్రభాతవార్త:** మహిళల భద్రత,రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారని డిసిపి శ్యామ్ సుందర్ తెలిపారు. అదివారం రాత్రి బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన మీ సురక్ష అవగాహన సదస్సుకు అయన ప్రసంగించారు. బోయిన్‌పల్లిలోని సాయిపద్మజాకాలనీలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మల్కాజిగిరి పోలీస్ కమీషనరేట్ పరిధిలో పౌరులభద్రత కోసం ప్రవేశపెట్టిన కమ్యూనిటీ పోలిసింగ్ మీ సురక్ష కార్యక్రమం ఎంత గానో ఉపయోకరంగా ఉందన్నారు. అపార్ట్‌మెంట్స్, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలోని ఇండ్లల్లో పనిచేసే సర్వేంట్‌లు డ్రైవరులు, వాచ్ మెన్‌లు వంట మనుషల వివరాలను యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీవర్ధన్, కిరణ్ నందిత, విజయకాంత్, కాలనీ ప్రతినిధులు రంగారావ్, తులసీ, సోమెస్,దేవేందర్, మల్లికార్జున్,రవిచంద్ర పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల్లో మెడిటేషన్ మాస్టర్

**నిజాంపేట్, మే 18, ప్రభాతవార్త:** అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మెడిటేషన్ మాస్టర్ కుంచపు రమ ఆదివారం పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వాసవి సేవక్ ఆధ్వర్యంలో వాసవి సేవక్ అధ్యక్షుడు అల్లాడి మహేష్ కుమార్ పిలుపు మేరకు ప్రగతినగర్ కమాన్ ఎదురుగా ఉన్న మియాపూర్‌రోడ్డులో నిర్వహించిన మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వేసవితీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంత మంచి కార్యక్రమానికి ఆహ్వానం పలికిన అల్లాడి మహేష్ కుమార్‌కి, వారి మిత్రబృందానికి కుంచపు రమ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలను రాజశేఖర్ రెడ్డి, అగ్రికల్చర్ కమిషన్ సభ్యురాలు భారతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ స్పోక్‌పర్సన్ రమణి, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ రఫీయా, ఓబీసీ జిల్లా కన్వీనర్ బికన్న తదితర కాంగ్రెస్ నాయకులు, ఆర్య సమాజ్ పెద్దలు, సేవాకమిటీ సభ్యులు, స్థానికప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్న అల్లాడి మహేష్ కుమార్‌కి దేవుని ఆశీస్సులు, గురువుల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని కుంచపు రమ ఆకాంక్షించారు.

## జోనల్ కమిషనర్‌ను కలిసిన విజయారెడ్డి

**ఖైరతాబాద్, మే 18, (ప్రభాతవార్త):** జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బదావత్ సం తోష్‌ని ఖైరతాబాద్ నియో జకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ పి.విజయరెడ్డి సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విజయ రెడ్డి మాట్లాడుతూ ఖైరతాబాద్ జోన్ పరిధిలో ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని కోరారు. ముఖ్యంగా పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు, పట్టణాభివృద్ధి పనులపై ప్రత్యేకదృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమా వేశంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

## నేడు విహెచ్‌కు అభినందన సత్కారం

**సైఫాబాద్, మే 18, ప్రభాతవార్త:** తెలుగుభాషా సాంస్కృతికశాఖ, సీల్‌వెల్ కార్పోరేషన్, ఆదర్శ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19న మంగళవారం సాయంత్రం రవీంద్రభారతిలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావుకు అభినందన సత్కారం-సీల్‌వెల్ శృతిలయ జీవన సాఫల్య పురస్కారం-2026' సభ జరుగుతుంది. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, విహెచ్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని, ఆదర్శ ఫౌండేషన్ వ్యవ స్థాపకుడు కుసుమ భోగరాజు, అవార్డ్ కమిటీ చైర్మన్ డా.మహ్మద్ రఫీ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఈసభకు సంబంధించిన బ్రోచర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, విశిష్ట అతిథిగా శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పాల్గొంటారని, సభకు పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ అధ్యక్షత వహిస్తారని, ఈ సందర్భంగా సీల్‌వెల్ సినీ సుస్వరాలు-86 జరుగుతాయన్నారు.

## పెంచిన ధరలను కేంద్రం వెంటనే తగ్గించాలి

**కార్వాన్, మే 18, ప్రభాతవార్త:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలనలో అడ్డగోలుగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు, మిత్ర అసోసియేట్ ఛైర్మెన్ మిత్ర కృష్ణ డిమాండ్ చేశారు. మెహిదీపట్నం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలపై అదనంగా మూడు రూపాయలు పెంచడం అత్యంత దుర్మార్గానికి నిదర్శనమన్నారు. ఈ ధరల పెంపును కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటికే ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న సామాన్యుడిపై కేంద్ర ప్రభుత్వం మరోసారి ధరల భారాన్ని మోపిందని మండిపడ్డారు. డీజిల్, పెట్రోల్ ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ధరల వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని, నిరుపేద కుటుంబాలు బ్రతికే పరిస్థితి లేకుండాపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, ఇలా ధరలు పెంచుకుంటూ పోతే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మిత్ర కృష్ణ హెచ్చరించారు.

## నగరంలో వేల మెడికల్ షాపులు బంద్

**సైఫాబాద్, మే 18 ప్రభాతవార్త:** ప్రజారోగ్య పరిరక్షణ కోసం, అన్‌లైన్‌లో అక్రమ మందుల వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20 జంట నగరాల్లో 25 వేల మెడికల్ షాప్‌లు బంద్‌లో ఉంటాయని హైదరాబాద్ డిస్టిక్ కెమిస్ట్స్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ తెలిపింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి రాగం సంతోష్‌కుమార్, కోశాధికారి మహ్మద్ ఖాజా నజిబుద్దీన్ మాట్లాడుతూ 20వ తేదీన జరగబోయే ఈబంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. 20న జంట నగరాల్లోని 25 వేల మెడికల్ షాప్‌లు బంద్‌లో ఉంటాయని, తమకు అపోలో, మెడి ప్లస్, వివిధ ప్రజా సంఘాలు కూడా మద్దతు ఇచ్చాయని చెప్పారు. ఈనెల 20వ తేదీన జరిగే బంద్‌తో ప్రభుత్వం స్పందించకపోతే ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా నిరవధిక ఆందోళనలకు దిగవలసి వస్తుందని వారు హెచ్చరించారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

## మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్ టౌన్, మే 17, ప్రభాతవార్త**
బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బేటీ బచావో.. బేటీ పడావో అని నినాదాలు ఇస్తున్నారని, కానీ అవి కేవలం నినాదాలకే పరిమితమైతే న్యాయం జరగడం లేదన్నారు. భారతదేశ చరిత్రలో తొలిసారి ఒక కేంద్ర మంత్రి కుమారుడిపై లుకౌట్ నోటీస్ జారీ అయ్యే పరిస్థితి వచ్చిందని, కేసులో నిందితు డైన కుమారుడిని తొమ్మిది రోజుల పాటు ఎందుకు దాచిపెట్టారో సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నిం చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు అధి కార పదవుల్లో కొనసాగడం తెలంగాణకే కాదు దేశా నికే అవమానకరమని వ్యాఖ్యానించారు. మైనర్ బాలికకు అన్యాయం జరిగిందని, బాధితురాలి కుటుం బాన్ని భయభ్రాంతులకు గురిచేసింది స్వయంగా కేంద్ర మంత్రేనని ఆరోపించారు. బాధిత బాలిక తల్లిదండ్రులను పిలిపించి ఒత్తిళ్లు తెచ్చే ప్రయత్నం చేశారని చెప్పారు. అలాగే కేసును నీరుగార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించిందని, హనీట్రాప్ పేరు తో విషయాన్ని మళ్లించే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి ఇద్దరూ కలిసి మీడియాపై ఒత్తిడి తెచ్చి వార్తలు రాకుండా చేశారని ఆరోపించారు. ఇలాంటి ఘటనల్లో అధికారంలో ఉన్నవాళ్లు తప్పించుకుంటే ఇకపై ఏ ఆడబిడ్డా ధైర్యంగా బయటకు వచ్చి ఫిర్యాదు చేయలేని పరిస్థితి వస్తుందని, అందుకే కేంద్ర మంత్రిని వెంటనే తొలగించి, కేసుపై నిష్పాక్షి క విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక తల్లిదండ్రులు ఒత్తిళ్లకు లొంగకుండా పోరాడటం అభినందనీయమన్నారు. బిఆర్ఎస్ మహిళా నాయ కత్వం, విద్యార్థి సంఘాలు, సోషల్ మీడియా కార్యకర్తలు బాధితురాలి తరఫున పోరాడి న్యాయం జరిగేలా చేశారని పేర్కొన్నారు. అలాగే పార్టీ నాయ కులు, మహిళా విభాగం, డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ చేసిన పోరాటాన్ని కొనియాడారు.



జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నాయకులు


ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ప్రజావాణిలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమా వతి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకం తో ప్రజావాణి కార్యక్రమానికి విచ్చేసి అందజేసిన ఫిర్యాదులను పరిశీలించి అర్హతలమేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 98 దరఖాస్తులను స్వీకరించినట్లు వివరించారు. కార్య క్రమంలో డిఆర్వో నాగరాజమ్మ,ఎస్డిసి వరలక్ష్మీ, అధికారులు పాల్గొన్నారు.

## చెరువులో పూడికతీత పనులు ప్రారంభం


చెరువులో పూడికతీత పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శిల్ప

**కొండపాక, మే 18, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండల పరిధిలోని లకుడారంలో సర్పంచ్ శిల్పనర్సింలు అధ్వర్యంలో విబీజీ రాంజీ పథకంలో భాగంగా సోమవారం మల్లారెడ్డి చెరువులో మట్టి పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చెరువులో మట్టి పూడికతీతవల్ల చెరువులో నీటి మట్టం పెరిగి రైతులకు మేలు జరుగుతుం దన్నారు. చెరువులోని సారవంతమైన మట్టిని వ్యవసాయ పొలాల్లో పోయ డం వల్ల పంటల దిగుబడి పెరిగి రైతులు అధిక లాభాలను పొందుతారని అమె తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దేవి నర్సింలు, గట్టు చంద్రం, లావణ్య బిక్షపతి, క్షేత్ర సహయకురాలు లావణ్య, పాల్గొన్నారు.

## ప్రతి పింఛన్‌దారుడు ముఖ కవలికల గుర్తింపు చేయించుకోవాలి


కుకునూరువల్లిలో ముఖచిత్ర కవలికల గుర్తింపు నిర్వహిస్తున్న దృశ్యం

**కొండపాక, మే 18, ప్రభాతవార్త :** చేయూత ఫించన్‌దారుల ముఖచిత్ర కవలికల గుర్తింపు కార్యక్రమాన్ని సోమవారం కుకునూరుపల్లి, కొండపాక మండలాల్లోని కుకునూరుపల్లి, మేదినిపూర్, తిప్పారం, మాత్‌పల్లి, దుద్దెడ, కొండపాక, తిమ్మారెడ్డిపల్లి, వెలికట్ట తదితర గ్రామాలతోపాటు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో చేయూత పింఛన్ లబ్ధిదారుల ముఖచిత్ర గుర్తింపు కార్యక్రమం పంచాయతీ కార్యదర్శుల అధ్వర్యంలో నిర్వహిం చారు. లబ్ధిదారుల అధార్ కార్డు నంబర్‌ను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయగానే లబ్ధిదారుల పూర్తి సమాచారం చూపిస్తాయని, ఆ వివరాలతోపాటు ముఖచిత్ర కవలికలు గుర్తుపట్టడం జరుగుతుందన్నారు. బ్యాంకు ద్వారా పింఛన్ తీసు కునే ప్రతి లబ్ధిదారుడు ముఖచిత్రకవలిక కార్యక్రమం పూర్తి చేయించుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ముఖచిత్రకవలికల గుర్తింపు చేయించు కోని వారి పింఛన్‌లను ప్రభుత్వం నిలిపివేసే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుకునూరుపల్లిలో కార్యదర్శి స్వప్న కారోబార్ శ్రీధర్, రాజు పాల్గొన్నారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీని మూసివేయాలి


ఎంపిడివోకు వినతి పత్రం అందజేస్తున్న అఖిలపక్ష నేతలు

**బెజ్జంకి, మే 18, ప్రభాతవార్త :** మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల అనేక దుష్ప్రభావాలు ఉన్నాయని అఖిలపక్ష నేతలు, ప్రజాసంఘాలు రైతు యుద్ధం ప్రజాఆరోగ్యం పేరుతో విడతలవారీగా ఇథనాల్ ఫ్యాక్టరీని శాశ్వతం గా మూసివేయాలని వివిధ కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా సోమ వారం ఎంపిడిఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ధర్మ సమాజ్ పార్టీ మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల సురేష్ మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల మండల వ్యాప్తంగా సహజ వనరుల కాలుష్యం, ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని వెంటనే ప్రభుత్వం, అధికారులు స్పందించి ఇథనాల్ ఫ్యాక్టరీని మూసివేయాలని లేదా జనావాసాలకు దూరంగా నిర్మా ణాలు చేపట్టాలన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీని మూసివేయడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో స్వేరో రాష్ట్ర నాయకులు బొర్ర సురేష్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు వడ్లూరి పర్ష రాములు, బోనగిరి చంద్రం, లింగాలబాబు, స్వామి, కనగండ్ల శంకర్, సీపీఎం నాయకులు సంగ ఎల్లయ్య, ఎఐవైఎఫ్ మహేష్ పాల్గొన్నారు.

## క్యాసారం బీరప్ప జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, మే 18, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని క్యాసారం గ్రామంలో సోమవారం నిర్వహించిన బీరప్పలజాతరలో ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. స్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురా రోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, ప్రభాకర్, ఈశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కౌన్సిలర్

**గజ్వేల్ టౌన్, మే 18 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ లోని 14వ వార్డులోని ప్రజలకు ప్రజాపాలన పట్టణ ప్రగతిలో భాగంగా కౌన్సిలర్ గుంటుకు లక్ష్మి శ్రీనివాస్ చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయ కుండా చెత్త డబ్బాలలో వేసి మున్సిపల్ నుండి వచ్చే చెత్త సేకరణ వాహ నానికి అందించాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిర్మూలించి పరిసరాల పరిశుభ్రతకు కృషిచేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటిని శుభ్రంగా ఉంచు కున్నట్లుగానే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ వహీద్, షకీల్‌పాషా, ఆర్‌పి లావణ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో కలెక్టర్‌కు దండం పెడుతున్న బాధితురాలు

## వడదెబ్బతో భర్త చనిపోయారు..
### ఆదుకోవాలని బాధితురాలు ప్రజావాణిలో కన్నీరు

**సిద్దిపేట అర్బన్, మే 18, ప్రభాతవార్త :** వడదెబ్బ తగిలి కుటుంబ పెద్ద మృతి చెందాడు..కాళ్లు మొక్కుతా బాంచన్ ఆదుకోవలంటూ ఓ బాధిత వృద్ధు రాలు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం జిల్లా కలెక్టర్ హైమావతిని వేడుకుంది. బాధిత మహిళ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్నపేట మండలం దాసు తండాకు చెందిన గుగులోతు రంగా సుతారి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని తెలిపారు. ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి గత నెల 26న మృతి చెందడానికి తెలిపారు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కు చనిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెల కొందని బుజ్జి వివరించారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో పూట గడవడమే కష్టం ఉందని వాపోయారు. ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని విన్నవించగా కలెక్టర్ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## పేద కుటుంబాలకు కొండంత అండ సిఎంఆర్ఎఫ్

**ములుగు, మే 18 (ప్రభాతవార్త):** అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందిపడే పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని సర్పంచుల ఫోరం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని క్షీరసాగర్ గ్రామానికి చెందిన మండల రాణమ్మ, వేలేటి కృష్ణారెడ్డిలు ప్రైవేట్ ఆసు పత్రుల్లో చికిత్స పొందగా పెద్దమొత్తంలో ఖర్చు కావడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రాణమ్మకు రూ.17,500, కృష్ణారెడ్డికి రూ.47,500 చెక్కులు మంజూరుకాగా సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయనిధి వరంలా నిలుస్తుందని అన్నారు. పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల పరశురాం, మాజీ సర్పంచ్ మక్తాల వెంకటేష్, మాజీ ఎంపిటిసి తారక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సెంట్రింగ్ యూనియన్ ధర్నా

**మర్కుక్, మే 18 (ప్రభాతవార్త):** ఐరన్ ధరలు భారీగా పెరగడంతో సెంట్రింగ్ పనులు చేయడం భారంగా మారిందని మర్కుక్ మండల సెంట్రింగ్ యూనియన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఐరన్ సామాగ్రి అద్దెలు, రవాణా ఖర్చులు, కార్మిక వ్యయాలు పెరిగినా పనుల రేట్లు మాత్రం పాతవే కొనసాగుతున్నాయని తెలిపారు. దీంతో కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సెంట్రింగ్ పనుల రేట్లు పెంచాలని యూనియన్ నాయకులు డిమాండ్‌చేశారు. సమస్యల పరిష్కారానికి మండలకేంద్రంలో మంగళవారం ఒకరోజు దీక్షతో పాటు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమానికి కాంట్రా క్టర్లు, ఇంటి యజమానులు, తాపీ కార్మికులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో బిఎన్ఆర్‌కెఎస్ మండల అధ్యక్షుడు నర్సింలు, సెంట్రింగ్ యూని యన్ అధ్యక్షుడు కొంతం కిషన్, సభ్యులు డి.బాబు, నిజాముద్దీన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సెంట్రింగ్ యూనియన్ నాయకులు

## రామలింగేశ్వర స్వామికి వెండి కిరీటం బహూకరణ

**కీసర, మే18, ప్రభాతవార్త:** ప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పొన్నం తరుణ్ గౌడ్ స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి వారికి వెండి కిరీటాన్ని సమర్పించి భక్తిని చాటుకున్నారు. ఆలయానికి చేరుకున్న తరుణ్‌గౌడ్‌కి అర్చకులు, ఆలయ అధికారులు సాంప్రదా యబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో అభిషేకం, అర్చనలు నిర్వహించి వెండి కిరీటాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తటాకం అభిలాష్, కర్రె రాజేష్ పాల్గొన్నారు.

## బలవంతుపు భూసేకరణలు నిలిపివేయాలి

**యాచారం, మే 18, ప్రభాతవార్త :** ప్రభుత్వాలు మారిన రైతుల గోస తీరడం లేదని స్వచ్ఛందసేవా కార్యకర్త కవుల సరస్వతి ఆవేదన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వాలు పేదల కోసం భూములను పంచితే నేడు ప్రభుత్వాలు రాబందుల్లా వాటిని లాక్కుంటున్నాయని మండి పడ్డారు. ఫార్మా కంపెనీకి భూములను ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెబుతున్నా... ప్రభుత్వాలు మొండి వైఖరితో పోలీసులను అడ్డుపెట్టుకుని అన్యాయంగా లాక్కుంటున్నాయని ఆరో పించారు. వ్యవసాయం నమ్ముకున్న రైతుల నోట్లో మట్టి కొట్టినట్టు చేస్తున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిబంధన ఉల్లంఘించి పంతం సాగిస్తే ఉరుకునేది లేదని హెచ్చరించారు.

## పరిశ్రమల భద్రతకు మాక్ ఎక్సర్‌సైజ్

**కొత్తూరు, మే 18, ప్రభాతవార్త:** కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొ రేషన్ లిమిటెడ్ ప్లాంట్‌లో సోమవారం నిర్వహిం చిన మాక్ ఎక్సర్‌సైజ్ విజయవంతంగా పూర్తైంది. అగ్నిప్రమాదాలు, గ్యాస్ లీకేజీ వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే విధానాలపై అధికారులు ప్రత్యక్షంగా ప్రదర్శనలు నిర్వహించారు. ఫైర్ డిపార్ట్‌మెంట్, టీజీటీ విభాగం, మెడికల్ డిపార్ట్‌మెంట్, సీఆర్పీఎఫ్ బలగాలు, ఆక్టోపస్ వింగ్, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవా ల్సిన భద్రతా చర్యలు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానం, ప్రమాద నియంత్రణ చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అధికారుల సమన్వ యం, సిబ్బంది అప్రమత్తతతో కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. పరిశ్రమల భద్రతలో భాగంగా ఇలాంటి మాక్ ఎక్సర్‌సైజ్‌లు ఎంతో ఉపయోగకర మని అధికారులు తెలిపారు. కార్యక్రమాన్ని స్థానిక అధికారులు పర్యవేక్షించారు.

## శ్మశానవాటికు భూమిని కేటాయించండి

**కందుకూరు, మే 18, ప్రభాతవార్త:** కందుకూరు మండలం ముచ్చర్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఉట్ల పల్లి గ్రామ స్మశాన వాటికకు ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని గ్రామస్తులు స్థానిక సర్పంచ్ ఊటు పద్మ మహేందర్. మాజీ సర్పంచ్ తేరటి లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో స్థానికులు పెద్ద సంఖ్యలో వచ్చి కందుకూరు డివిజన్ కార్యా లయం ఆవరణలో జరిగిన ప్రజావాణి కార్యక్ర మంలో ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతిని ధులు నాయకులు మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు కోసం తమ గ్రామ పరిధిలోని వేలాది ఎకరాల భూమిని ప్రభుత్వం రైతుల వద్ద నుండి తీసుకుంటుందని పేర్కొన్నారు. గతంలో రైతులు ఎవరైనా మరణిస్తే తమ పంట పొలాల వద్ద దహన సంస్కారాలు చేసుకునేవారని, నేడు భూములు కోల్పోయిన వారంతా అయోమయ పరిస్థితిలకు గురికావాల్సి వస్తోందన్నారు. ఆర్డిఓ జగదీశ్వర్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సంబంధిత విషయాన్ని టీజీ ఐఐసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి వివిధ మండలాలకు సంబంధించి ఐదు ఆర్జీలు అందాయని ఆర్డిఓ తెలిపారు.

## బాల్య దశలోనే దేశభక్తిని పెంపొందించుకోవాలి

**పెద్దేముల్, మే 18, ప్రభాతవార్త:** విద్యార్థులు బాల్య దశలోనే దేశభక్తిని పెంపొందించుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత గాజుల బస్వరాజ్ అన్నారు. తాండూరు శ్రీరామక్రిష్ణ సేవా సమితి సౌజన్యంతో పెద్దే ముల్ మండలం మంబాపూర్‌లో 15 రోజుల పాటు నిర్వ హించిన సమ్మర్ క్యాంపు (బాల వికాస కేం ద్రం) ముగింపు సమావేశాన్ని సోమవారం ఘ నంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి శీ రామక్రిష్ణ సేవా సమితి గౌరవ అధ్యక్షులు గాజుల బస్వరాజ్ ముఖ్య అతిథిగా హజరై మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులు విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడంతో ఎంతో ఉపయో గపడతాయని అన్నారు. స్వామి వివేక నంద భావజాలాన్ని బాల్య దశ నుంచే అలవ ర్చుకొని, దేశానికి అవసరమైన మంచి పౌరులుగా ఎదగాలని, దేశభక్తిని పెంపొందించుకోవాలని విద్యా ర్థులకు సూచించారు. శ్రీరామక్రిష్ణ మఠం అధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.

# రైతు ప్రభుత్వం అని మాటల్లో కాదు.. చేతల్లో చూపించాలి

## మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

**హుస్నాబాద్ రూరల్, మే 18, ప్రభాతవార్త**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వ మని చెప్పుకుంటున్నప్పటికీ గ్రామీణస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ మండిపడ్డారు. సోమవారం పందిల్ల గ్రామంలోగల రైస్ మీల్లులను సందర్శించి మిల్లర్లు, రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతుల పంట కొనుగోళ్ల విషయం లో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో ధాన్యం, సన్‌ఫ్లవర్, పొద్దు తిరు గుడు, పత్తి కొనుగోళ్లలో సమస్యలు వచ్చినప్పుడు వెంటనే స్పందించి ప్రతి గింజ కొనుగోలు అయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.ప్రస్తుతం రైతులు ధాన్యాన్ని అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నా రని, మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గంలోనే ఈ పరిస్థితి ఉండటం దురదృష్టకరమ న్నారు. హైదరాబాద్‌లో కూర్చొని అన్నీ బాగున్నా యని చెప్పడం కాదు.. గ్రామాల్లో రైతుల పరిస్థితి తెలుసుకోవాలి అని వ్యాఖ్యానించారు.

**ప్రతి గింజ కొనాలి..**
బాయిల్డ్‌రైస్ అయినా, రా రైస్ అయినా రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు.అవసర మైతే మరిన్ని రైస్ మిల్లులను అనుమతించి కొను గోళ్లు వేగవంతం చేయాలన్నారు. మక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు పత్తి, పొద్దు తిరుగుడు పంటలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కోరారు.

**సిద్దిపేటలో సమీక్ష నిర్వహించాలి...**
సిద్దిపేట జిల్లాలో మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి ఎంత ధాన్యం కొనుగోలు అయింది, ఎంత నిల్వ ఉందో తెలుసుకుని కార్యాచరణ రూపొందిం చాలని సూచించారు. మరో రెండు మూడు రోజు ల్లో వానాకాలం పనులు ప్రారంభమయ్యే నేపథ్యం లో రైతులకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫోటో పోజులు కాదు.. యాక్షన్ కావాలి అని రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం పని చేయాలి అని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకగర్గ అధికార ప్రతినిధులు మల్లిఖార్జున్‌రెడ్డి, సుద్దాల చంద్రయ్య, మాజీ ఏఎంసి చైర్మెన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు అన్వర్, మాజీ పట్టణ అధ్యక్షులు రామకృష్ణతో పాటు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సతీష్‌కుమార్

## రేపు హుస్నాబాద్‌లో మెడికల్ షాపులు బంద్

**హుస్నాబాద్ టౌన్, మే 18, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా మెడికల్, కెమిస్ట్ అసోసియేషన్ల పిలుపుమేరకు ఈ నెల 20వ తేదీ బుధవారం నిర్వ హించనున్న ఆల్ ఇండియా మెడికల్ బంద్‌లో భాగంగా హుస్నాబాద్ లోని మెడికల్ షాపులు బంద్‌లో పాల్గొననున్నట్లు హుస్నాబాద్ మెడికల్ అసోసి యేషన్ అధ్యక్షుడు బింగి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమకు అవసరమైన రెగ్యులర్ మందులు, అత్యవసర మందులు ఒక రోజు ముందుగానే కొనుగోలు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు మెడికల్ రంగ సమస్యల పరిష్కారం కోసం ఈ బంద్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ బంద్‌కు ప్రజలు సహకరించి మద్దతు అందించాలని హుస్నాబాద్ మెడికల్ అసోసియేషన్ కోరింది.

## నేడు ద్విచక్ర వాహనం వేలం

**హుస్నాబాద్ రూరల్, మే 18, ప్రభాతవార్త :** హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో గతంలో పట్టుబడిన ఒక ద్విచక్ర వాహనానికి నేడు(మంగళవారం) ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలిచిన ఆసక్తిగల వ్యక్తులు ముందుగా స్టేషన్‌లో రశీదు పొందాలని సూచించారు. అనంతరం వేలంపాట ప్రక్రియలో పాల్గొనవచ్చని ఎక్సైజ్ సీఐ పవన్ పేర్కొన్నారు.

## హనుమాన్ దేవాలయానికి స్టీల్ తలుపులు విరాళం

**కొమురవెల్లి, మే 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాంసాగర్ గ్రామంలో ఉప సర్పంచ్ ఏసిరెడ్డి మల్లారెడ్డి దుర్గమ్మ గుడికి రూ.6 లక్షల విలువచేసే మూడు గుంటల భూమిని సోమవారం విరాళంగా అందజేశారు. అలాగే హనుమాన్ ఆలయానికి అక్కెనపల్లి యాదవరెడ్డి రూ.15 వేల విలువగల స్టీల్ తలుపులను విరాళంగా అందించారు. ఈసందర్భంగా ఉప సర్పంచ్ ఏసిరెడ్డి మల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి నా వంతు సహా యం చేయాలనే సంకల్పంతో గుడికి మూడు గుంటల భూమిన విరాళంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, కుల పెద్దలు, నాయకులు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయానికి రూ. 50 వేలు విరాళం

**నంగునూర్/సిద్దిపేట అర్బన్, మే 18, ప్రభాతవార్త :** పెద్దమ్మ తల్లి ఆశీ స్సులు ప్రజలందరిపై ఉండాలని వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. నంగునూర్ మండల పరిధిలోని నర్మెట గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మ-పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. పెద్దమ్మ తల్లి దేవాలయానికి రూ.50 వేల విరాళంగా అందించారు. అనంతరం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లిలో నిర్వహిం చిన శ్రీ బీరప్ప కామరతి-చౌడాలమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ.50 వేలు విరాళంగా అందించారు.

## క్రీడాకారులకు వాలీబాల్ కిట్స్ పంపిణీ

**సిద్దిపేట అర్బన్, మే 18,ప్రభాతవార్త :** యువతలో క్రీడస్ఫూర్తి నాయ కత్వ లక్షణాలను పెంపొందించటమే లక్ష్యంగా విద్యార్థులకు, యువతకు వాలీబాల్ కిట్స్‌ను పంపిణీ చేసినట్లు ఆర్ట్ ఆఫ్ గివింగ్ తెలంగాణ కన్వీనర్ వినోద్‌మోదాని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రొ॥స్వర్గీయ జయశంకర్ స్టేడియంలోని వాలీబాల్ అకాడమీ క్రీడాకారులకు వాలీబాల్ కిట్స్, టీషర్ట్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వశాంతికి, మానవీయ విలువల పరివ్యాప్తికి ఆర్ట్ ఆఫ్ గివింగ్ పని చేస్తుందన్నారు. ఆర్ట్ ఆఫ్ గివింగ్ వారోత్సవాలు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, నల్గొండ తదితర జిల్లాలో ఆర్ట్ ఆఫ్ గివింగ్ వారోత్సవాలు నిర్వహించనట్లు వివరించారు. ఆర్ట్ ఆఫ్ గివింగ్ ప్రపంచ వ్యాప్తంగా 200పైగా దేశాలలో సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వీరబత్తిని సత్యనారాయణ, ఆకుల పాండురంగం, పొద్దుటూరి సిద్దులు, శ్రీనివాస్, రాజ్‌బహుదూర్‌రెడ్డి,నాయిన సంజీవరెడ్డి, గ్యాదరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్‌లో శాస్త్రవేత్తలు

**చిన్నకోడూరు, మే 18, ప్రభాతవార్త :** రైతులు మెరుగైన వ్యవసాయ సాగు పద్దతులు అలర్చుకొని సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని శాస్త్రవేత్త ఎ.రమాదేవి అన్నారు. సోమవారం మండల పరిధి లోని ఇబ్రహీంనగర్ రైతువేదికలో రైతులకు జిల్లా వ్యవసాయశాఖ తోర్నాల వ్యవసాయశాఖ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ వివిధ పంటల సిఫారసు మేరకు యూరియా వినియోగం జీవ నియంత్రణ పద్దతులు నేల సంరక్షణ పచ్చిరొట్ట ఎరువుల వినియోగం సేం ద్రీయ వ్యవసాయం పద్దతులపై అవగాహన కల్పించారు. శాస్త్ర వేత్త సరిత మాట్లాడుతూ రైతులు విత్తనాలుకొనేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో జయంత్, సర్పంచ్ ములకల వజ్రవ్వ, ఏఈవో ప్రశాంత్, ఉప సర్పంచ్ స్వామి, విద్యార్థులు,రైతులు పాల్గొన్నారు.

**వరిగుంతల గ్రామంలో...**
**కొల్చారం, మే 18 ప్రభాతవార్త :** మండల పరిధిలోని సేరి వరిగుంతల గ్రామంలో ఈ రోజు రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేతలు రైతులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత, వరి కోయలను కాల్చడం వల్ల కలిగే నష్టాలు, వరి పంటలో వచ్చే చీడపీడల నివారణ చర్యలు, మార్కెట్‌లో అధిక ప్రాధాన్యం ఉన్న వరి వంగడాలు, సమతుల్య ఎరువుల వినియోగం, మట్టి నమూనా సేకరణ వంటి అంశాలపై వివరంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేతలు డాక్టర్ పి. సతీష్, డాక్టర్ బి. రమ్యశ్రీ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. అలాగే గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారి మరియు రైతులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**వర్గల్, మే 18 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన పల్లె లక్ష్మణ్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న గ్రామ యువకులు తాళ్ల భానుప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమ వారం బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులతోపాటు రూ.9వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే సర్పంచ్ నగరం కనకరాజుగౌడ్ రూ.3 వేలు, భూంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి రూ.3వేలు, భూంరెడ్డి చంద్రారెడ్డి రూ.2 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా తాళ్ల భానుప్రసాద్ గౌడ్, బోర్కు నర్సింలు మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, ఇందిరమ్మ ఇల్లు, పిల్లల చదువులకు ఆర్థిక పరంగా తమవంతు సహాయ సహకారాలు వారి కుటుంబానికి ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇవ్వడం జరిగింది. వారితో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## యువత క్రీడల వైపు దృష్టి సారించాలి : అంజిరెడ్డి

**ములుగు, మే 18 (ప్రభాతవార్త):** యువత క్రీడలవైపు దృష్టి సారించా లని ములుగు సహకార సంఘం చైర్మన్ బట్టు అంజిరెడ్డి, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు కడపల నరసింహారెడ్డి, సర్పంచ్ తీగుళ్ల కనకయ్య, బిఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు జుబేర్‌పాషా అన్నారు. నెల రోజులుగా ములుగులో రేసింగ్ గరుడ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నీ విజేతలకు ఆదివారం రాత్రి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువు ఎంత ముఖ్యమో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం అంతే ముఖ్యమన్నారు.సీనియర్ విభాగంలో ములుగు కింగ్స్ విజేతగా నిలువగా, ములుగు శివాజీ టైటాన్స్ రన్నరప్ సాధించారు. అలాగే బెస్ట్ డిఫెండర్‌గా జగదీశ్వర్, బెస్ట్ షూటర్‌గా విజయ్‌కుమార్‌లను ఎంపిక చేసి షీల్డ్‌లతో సత్కరించారు. జూనియర్ విభాగంలో విన్నర్ రన్నరప్‌లకు బహు మతులను అందజేశారు. సీనియర్ వాలీబాల్ టోర్నీకి కమ్మరి సుదర్శన్ చారి, జూనియర్ వాలీబాల్ టోర్నీకి సర్పంచ్ కనకయ్యలు పతకాలను స్పాన్సర్ చేశారు. జూనియర్ విభాగంలో విజేతలకు రూ.5వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.2,500 నగదు ఉపసర్పంచ్ కరుణాకర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుతాడి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, వార్డుసభ్యులు అశ్వద్ధామచారి, నాయకులు రవి, శ్రీనివాస్, ఆసిఫ్, రైసింగ్ గరుడ ఓట్స్ క్లబ్ ప్రతినిధులు హరీష్, శ్రీకాంత్, మధుసూదన్‌రెడ్డి, వెంకట్, మహేందర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

# ఇంప్రూవ్‌మెంట్ చార్జీలు తగ్గించండి

-జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి ఎమ్మెల్యే వినతి



జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, మే 18, ప్రభాతవార్త:**
తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో గల బిహెచ్ఇఎల్ బిఈమ్యాక్ సొసైటీ కాలనీ వాసులకు మంచినీటి కనెక్షన్ కోసం వసూలు చేస్తున్న ఇంప్రూవ్మెంట్ చార్జీలను తగ్గించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హైద్రాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందచేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో జలమండలి ద్వారా చేపడుతున్న మంచినీటి సరఫరా, రిజర్వాయర్లు, నూతన కనెక్షన్‌లపై ఎండి అశోక్ రెడ్డితో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చర్చించారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్ నగర్‌లో బిహెచ్ఈఎల్ పరిశ్రమలో విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన వారు బిఈమ్యాక్ సొసైటీ నామంతో గృహాలను నిర్మించుకుని జీవనం కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. మంచినీటి కనెక్షన్ కోసం జలమండలికి దరఖాస్తు చేసుకుంటే 3కోట్ల రూపాయలు చెల్లించాలని, 64 లక్షల రూపాయలు ఇంప్రూవ్మెంట్ చార్జీలు కట్టాలని నోటీసులు అందచేశారని తెలిపారు. ఈ పాటికే 3కోట్ల రూపాయలను డిడి రూపంలో జలమండలికి చెల్లించడం జరిగిందని వివరించారు. కాలనీలో ఉద్యోగ విరమణ చేసిన కార్మికులే అధికంగా నివసిస్తున్నారని, ఇంప్రూవ్మెంట్ చార్జీలు చెల్లించి ఆర్థిక స్తోమత వారికి లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాటలకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్‌రెడ్డి త్వరలోనే తగు నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యేకు హామీచేశారు. కార్యక్రమంలో ఉమేష్, బిఈమ్యాక్ సొసైటీ అధ్యక్షులు సంజీవ్‌ప్రసాద్, ఉపాధ్యక్షులు మాధవరావు, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ప్రతినిధులు వాసుదేవరావు, సందీప్‌రెడ్డి, సూర్య పాల్గొన్నారు.

## రోడ్డెక్కి నిరసన తెలిపిన రైతులు



వెల్దుర్తి వెళ్లే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

**చిన్నశంకరంపేట, మే 18, ప్రభాతవార్త:**
లారీల కొరత, తూకం వేయడంలో జాప్యం కారణంగా రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండటంతో ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. సోమవారం మండలపరిధి జంగరాయి రైతులు వెల్దుర్తికి వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. అధికారులు చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే లారీలను కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవు



అక్రమనిర్మాణాలను తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

**చిన్నశంకరంపేట, మే 18, ప్రభాతవార్త:**
మండలపరిధి అంబాజీపేటలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలను గ్రామ పంచాయతీ సిబ్బంది సోమవారం అడ్డుకున్నారు. గ్రామంలోని గిరికలవాడలో ప్రభుత్వ భూమిలో దారికి అడ్డంగా ఓ వ్యక్తి ప్రహరీగోడను నిర్మించడంతో పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ సదరు వ్యక్తికి నోటీసులు ఇచ్చినప్పటికీ నిర్మాణాలను ఆపకపోవడంతో సోమవారం పంచాయతీ సిబ్బందితో కలిసి నిర్మాణాలను తొలగించారు. ఈక్రమంలో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తపరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ శివానందం ఇరువర్గాలకు నచ్చచెప్పారు. స్థల పత్రాలు ఉంటే గ్రామస్థుల సమక్షంలో మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సర్పంచి సబితాగౌడ్ హెచ్చరించారు.

## చెరువు బాట ఆక్రమణ

-అధికారులకు రైతుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు చెరువు బాట ఆక్రమణపై ఫిర్యాదు చేస్తున్న రైతులు

**చౌటకూరు, మే 18, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరు-సరాఫ్‌పల్లి గ్రామాల మధ్యలో ఉన్న చెరువు బాటను ఆక్రమించి ఇంపి డిస్టిలరీ కంపెనీ వారు ప్రహరీగోడను నిర్మించే ప్రయత్నంచేస్తున్నారని ఆరోపిస్తూ చౌటకూరు, సరాఫ్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదుకు స్పందించిన తహసీల్దార్ రెవిన్యూ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కంపెనీవారికి పలుసూచనలు చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కంపెనీ యాజమాన్యానికి సూచించారు. చెరువు బాట ఆక్రమణపై జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు నివేదిక అందచేస్తామన్నారు. కలెక్టర్ సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

## దేశవ్యాప్త మెడికల్ షాప్‌ల బంద్‌పై అధికారులకు వినతిపత్రం అందజేత



ఎస్ఐకి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

**కొల్చారం, మే 18 ప్రభాతవార్త:**
ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న మెడికల్ షాప్‌ల బంద్ కార్యక్రమానికి సంబంధించి కౌడిపల్లి చిలిపిచెడ్ ఏరియా మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం కొల్చారం మండల తహసీల్దార్‌ను, కొల్చారం ఎస్ఐను కలిసి బంద్ వివరాలను తెలియజేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ తరపున బంద్ నిర్వహణకు సంబంధించిన రిప్రజెంటేషన్‌ను అధికారులకు అందజేశారు. దేశవ్యాప్తంగా ఫార్మసీరంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఈ బంద్ చేపడుతున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి, చిలిపిచెడ్ ఏరియా అసోసియేషన్ ప్రతినిధులు, మెడికల్ షాప్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## కోర్టు స్టే ఉండగా నిర్మాణాలకు అనుమతెలా ఇస్తారు

-కొల్లూరు లక్ష్మీపురం ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు



విలేకరులతో మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యుల దృశ్యం

**రామచంద్రాపురం, మే 18, ప్రభాతవార్త:**
కోర్టు స్టే ఉండగా హెచ్ఎండిఎ అధికారులు నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇస్తారని లక్ష్మీపురం ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. సోమవారం మండల పరిధిలోని కొల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ సభ్యులు కెఎస్‌మూర్తి, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేశం, రాకేష్, రామ్మోహన్‌రావు, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మల్లేశం, గిరిజలు మాట్లాడుతూ 1984లో కొల్లూరులోని సర్వే నంబర్ 172, 173, 175, 177, 180, 181, 182, 184, 186, 187, 188, 189, 190లలో తాము ప్లాట్లు కొన్నామన్నారు. ప్లాట్లుచేసి అమ్మిన భూములను 2003లో వ్యవసాయ భూములుగా చూపించి మరొకరికి అమ్మినట్లు, అప్పటినుంచి తాము ప్లాట్లకోసం విఎల్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పోరాడుతున్నామన్నారు. కోర్టు పరిధిలో ఉన్న భూమిలోని సర్వే నంబర్ 188లో ప్రసాద్ తన పేరున పట్టాదార్ పాసుపుస్తకాలు తీసి హెచ్ఎండిఎ అనుమతులుతెచ్చి నిర్మాణాలను చేపడుతున్నారన్నారు. సర్వే నంబర్ 188లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ 188 సర్వే నంబర్‌లో బహుళ అంతస్తుల నిర్మాణాలకు హెచ్ఎండిఎ అధికారులు అనుమతులు ఇవ్వడం శోచనీయమన్నారు. 188 సర్వే నంబర్‌లో కొనసాగుతున్న నిర్మాణాలను హెచ్ఎండిఎ అధికారులు నిలిపివేసి తమకు న్యాయం చేయాలని అసోసియేషన్ సభ్యులు కోరారు.
ఆర్‌సిసి పి-2:

## పెరిగిపోతున్న కుక్క కాట్లు

-చౌటకూరులో ఇద్దరు చిన్నారులకు గాయాలు

**చౌటకూరు, మే 18, ప్రభాతవార్త:**
మండల పరిధిలో కుక్క కాట్లు నిత్యం చోటుచేసుకుంటున్నాయి. మండల కేంద్రమైన చౌటకూరులో ఇద్దరు చిన్నారులు కుక్కకాటుకు గురవడం ఇందుకు ఉదహరించవచ్చు. మండల కేంద్రమైన చౌటకూరులో వీధి కుక్కల బెడద అధికంగా మారింది. గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులను వీధి కుక్కలు కాటేయడంతో కుటుంబ సభ్యులు చిన్నారులను జోగిపేట ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గ్రామంలో ఆరుబయట సంచరించేందుకు ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. కుక్కల బెడదను పంచాయతీ అధికారులకు, సంబంధితశాఖల అధికారులకు విన్నవించినా, సమస్య శాశ్వతపరిష్కారానికి నోచుకోవడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## నామమాత్రంగా ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రం

**అల్లాదుర్గం, మే 18, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని సీతానగర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి రెండునెలల గడుస్తున్నా నేటివరకు వడ్లను ఎందుకు కొనుగోలు చేయడంలేదని బిజెపి జిల్లా నాయకులు బ్రహ్మం ప్రశ్నించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన కొనుగోలుకేంద్రంలో వడ్లను కొనుగోలు చేయకపోతుండటంతో అన్నదాతలు తాము ఆరుగాలం కష్టించి పండించిన వడ్లను తక్కువధరకు మధ్య దళారులకు అమ్ముకుంటూ ఆర్థికంగా ఆగం అవుతున్నారని విచారం వ్యక్తంచేశారు. విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకుపోయినా ఫలితంలేకుండా పోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఐకెపి అధికారులు స్పందించి వడ్లను కొనుగోలుచేసేలా చర్యలు తీసుకోవాలని, అధికారులు స్పందించకుంటే రైతులతో కలిసి ధర్నా చేయాల్సి వస్తుందని ఈ సందర్భంగా బ్రహ్మం హెచ్చరించారు.

## చౌటకూరులో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**చౌటకూరు, మే 18, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన చౌటకూరులోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారరం రైతు ముంగిల్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రైతులకు పంటలు, ఎరువులు తదితర వాటిపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను పండించాలని, పంటమార్పిడి చేస్తూ పంటలను పండించాలన్నారు. పంటమార్పిడితో భూమిలో సారం పెరిగి పంట దిగబుడి అధికంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ వి.హమలత, డాక్టర్ ఎ.నిర్మల, గ్రామ సర్పంచ్ పార్కాల రామ్‌రెడ్డి, రైతులు మాణిక్‌రెడ్డి, జనార్ధన్, మల్లికార్జున్‌గౌడ్, రాములు, సాయిలు, రాజేశ్వర్‌లు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

**చిన్నశంకరంపేట, మే 18, ప్రభాతవార్త:**
ఈ-ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బందు నిర్వహిస్తున్నట్లు చిన్నశంకరంపేట మండల మెడికల్ అసోసియేషన్ సభ్యులు సోమవారం తెలిపారు. అఖిల భారత ఔషధ విక్రేతల సంఘం ఎఐఓసిడి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా మెడికల్‌షాపుల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతూ తహసీల్దార్ మహేందర్, ఎస్ఐ శివానందంలకు వినతిపత్రం అందించారు.

## రామాయంపేట మున్సిపాలిటీలో షట్టర్ల కుంభకోణం

-రూ.5కోట్ల ఆదాయానికి గండి... క్రిమినల్‌కేసులు పెట్టాలని బిజెపి డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**రామాయంపేట, మే 18, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపాలిటీలో భారీ అవినీతి చోటుచేసుకుందని, ప్రభుత్వ ఆస్తులను అక్రమంగా విక్రయిస్తున్నా.. పాలకవర్గం చోద్యం చూస్తోందని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు ఆరోపించారు. సోమవారం రామాయంపేట పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15వ ఫైనాన్స్ నిధులు, ఎన్నికల నిధుల గోల్‌మాల్ మరువకముందే మరో కుంభకోణం వెలుగులోకిరావడం బాధాకరమన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 2006లో మున్సిపల్ స్థలంలో 13షట్టర్లను (దుకాణ సముదాయం) నిర్మించి 20 ఏళ్ల లీజుకు ఇచ్చారని తెలిపారు. 2026తో లీజు గడువు ముగిసినా, మున్సిపల్ అధికారులు, పాలకవర్గం వాటిని స్వాధీనం చేసుకుని రీటెండర్ నిర్వహించలేదని విమర్శించారు. ఇదే అదనుగా ఆ 13 షట్టర్లలో రెండింటిని ప్రస్తుతం కిరాయికి ఉన్న వ్యక్తులు రూ.54 లక్షలకు అమ్ముకున్నారని, ఇది పూర్తిగా అక్రమమని రాములు ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను లీజుదారులు విక్రయిస్తున్నా, పాలకవర్గం మౌనం వహించడం విచారకరమన్నారు. పాలకవర్గం నిర్లక్ష్యం వల్ల ప్రజా ఆస్తులు కొందరి చేతుల్లోకి వెళ్తున్నాయని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. అక్రమంగా షట్టర్లు అమ్ముకున్నవారి పేర్లు బయట పెట్టి, క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వెంటనే స్పందించి 13 షట్టర్లను మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకుని రీటెండర్ చేపట్టాలని, ప్రజల ఆస్తిని కాపాడాలని కోరారు. లేనిపక్షంలో మున్సిపాలిటీని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు శీలం అవినాష్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు భానుచందర్, యువ మోర్చా నాయకులు నాగరాజు, అనిల్, సంతోష్, వెంకటి, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఉపసభాపతికి ఉద్యమనేత వినతిపత్రం



పద్మాదేవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఉద్యమనేత అశ్విని

**రామాయంపేట, మే 18, ప్రభాతవార్త:**
రామాయంపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు విషయంపై మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డికి ఉద్యమనేత పోచమ్మల అశ్విని శ్రీనివాస్ సోమవారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి డివిజన్ ఏర్పాటు విషయాలను వెల్లడించినట్లు తెలిపారు. రామాయంపేట, నిజాంపేట మండలాల ప్రజల అవసరాలకోసం ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేశామన్నారని, కార్యాలయం ఏర్పాటు సమయంలో జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్ ఇచ్చి అధికారికంగా ప్రారంభోత్సవం చేశారని తెలిపారు. తూప్రాన్ ఆర్డీవోకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి కొంతమంది సిబ్బందిని కూడా నియమించారని గుర్తుచేశారు. అయితే ఎన్నికల తర్వాత ఆ ప్రొసీడింగ్‌ను గెజిట్ రూపంలోకి తీసుకురాకపోవడం వల్లే రామాయంపేట రెవెన్యూ డివిజన్ పూర్తిస్థాయిలో ఏర్పాటుకాలేదని ఆమె స్పష్టంచేశారన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూశాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే ఉన్న ప్రొసీడింగ్‌నే గెజిట్ నోటిఫికేషన్‌గా మార్చి పూర్తిస్థాయి ఆర్డీవో, సిబ్బందితో కార్యాలయం ఏర్పాటుచేసుకోవచ్చు అని సూచించారని అశ్విని తెలిపారు.

## డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు తగ్గించాలంటూ ధర్నా



వెల్దుర్తిలో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

**వెల్దుర్తి, మే 18, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం సిపిఎంపార్టీ ఆధ్వర్యంలో పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించాలంటూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలు సామాన్యుల నడ్డి విరుస్తున్నాయని ఆరోపించారు. సామాన్యప్రజలు కొనలేని స్థితిలో గ్యాస్ ధరలు ఉన్నాయని, పెంచిన ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని, లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీమండల కార్యదర్శి గౌరీ, మండల కమిటీ సభ్యులు వెంకటి, సాయిలు, బాబు, అశోక్, బాబు, నర్సింలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సర్పంచ్



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ నారాయణ చౌహన్

**మొగుడంపల్లి, మే 18, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గౌసాబాద్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రాలను సర్పంచ్ నారాయణ చౌహన్ సోమవారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న సేవలపై సిబ్బందిని సర్పంచ్ అడిగి తెలుసుకున్నారు. బాలింతలు, చిన్నారులకు పాలు, గుడ్లు, బాలామృతం లాంటి పోషకాహారం క్రమంతప్పకుండా అందించాలని సర్పంచ్ సిబ్బందికి సూచించారు. సుఖప్రసవాలు జరిగేలా గర్భిణులకు అవసరమైన పోషకాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించాలని సర్పంచ్ నారాయణ చౌహన్ తెలిపారు.

## మహిళలకు 30 రకాల రక్త పరీక్షలు

-శిబిరాన్ని ప్రారంభించిన టిజి ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



స్వయంసహాయక గ్రూప్ మహిళలకు రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

**కంది, మే 18, ప్రభాతవార్త:**
మండలంలోని స్వయం సహాయక గ్రూప్ మహిళలకు సోమవారం 30 రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. ఏర్పాటుచేసిన శిబిరాన్ని టిజి ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ పరీక్షలు చేయించుకున్న మహిళలకు ఏవైనా సమస్యాత్మక రోగాలుంటే పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేస్తారన్నారు. డిఆర్‌డిఓ అడిషనల్ పిడి సూర్యరావు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంగా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. పంచాయతీరాజ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ దివ్యదేవరాజన్ సెర్ప్ కార్యాలయం నుంచి 100 రూపాయలు చెల్లించి మహిళలకు ఉచితంగా 30రకాల రక్త పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో శిబిరాలు నిర్వహిస్తారని, కంది మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామన్నారు. కందిమండలంలో 727మహిళాసంఘాల్లో 8432 మంది మహిళాసభ్యులున్నారన్నారు. ప్రతినిత్యం ఆన్‌లైన్‌లో 50మందికి రిజిస్ట్రేషన్ చేయించి రక్తపరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునందప్రవీణ్, ఎపిఎం వెంకట్, శివలక్ష్మి, ఐకెపి సిసి, సిఎ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## కిశోర బాలికలకు వికాసం వేసవి శిక్షణ



వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తున్న దృశ్యం

**మొగుడంపల్లి, మే 18, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన మొగుడంపల్లిలో సోమవారం కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల నిరోధం, సైబర్ క్రైమ్, పోక్సో చట్టం తదితర అంశాలపై బాలికలచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిభ చాటిన బాలికలను ఈ సందర్భంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం టీక్యనాయక్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యక్రమం విజయవంతం

**కొల్చారం, మే 18, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, కొల్చారం-కౌడిపల్లి-చిలిప్‌చెడ్ ఏరియా ప్రధానకార్యదర్శి ఆరుగొండ అశోక్‌కుమార్ పాల్గొని సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధ్యక్షులు పొన్నం మనోహర్‌గౌడ్, ఏరియా అసోసియేషన్ కోశాధికారి మాలి వెంకన్న, జిల్లా ఈసి సభ్యులు కాలేరు శ్రీనివాస్, గోకుని రాజాగౌడ్, సందీప్, రెడ్డయ్య పాల్గొన్నారు. అలాగే ఏరియా అసోసియేషన్ నాయకులు నర్సింహారెడ్డి, ప్రభాకర్, ప్రశాంత్, శంకర్‌గౌడ్, అనిల్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, రహీం, యూసుఫ్, హరీష్‌గౌడ్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రోడ్డెక్కిన అన్నదాతలు..



నిరసన చేపడుతున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

**పాపన్నపేట, మే 18, ప్రభాతవార్త:**
ధాన్యం తరలించేందుకు లారీలు ఏర్పాటు చేయడంలేదని సోమవారం మండల పరిధిలోని మిన్పూర్ రైతులు రోడ్డు ఎక్కి నిరసన, తెలిపారు. దీంతో మెదక్ బోడ్మాట్‌పల్లి రహదారిపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ధాన్యం తరలింపులో వాహనాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం అయ్యారని, వాతావరణం మార్పులతో అకాలవర్షాలు సంభవిస్తే ధాన్యం తడిసిపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయని కొనుగోలు కేంద్రాల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోతుండగా, వాటిని తరలించేందుకు అవసరమైన లారీలు అందుబాటులో లేక రైతులు రోడ్డెక్కే పరుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. రోజుల తరబడి ధాన్యం తూకంకాకపోవడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు రాత్రింబవళ్లు అక్కడే కాపలా కాస్తున్నామన్నారు. తూకం పూర్తైనా, ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో కొత్తగా వచ్చిన ధాన్యానికి స్థలం లేక కేంద్రాలు కిక్కిరిసిపోయాయిని వాపోయారు. ధాన్యపురాశులు రోడ్డుపైనే ఉండిపోవడంతో వర్షం పడితే నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. లారీలు సరిపడా ఏర్పాటుచేయడంలో అధికారుల వైఫల్యం కారణంగా సమస్య మరింతగా తీవ్రమైందని రైతులు ఆరోపిస్తున్నారు. హమాలీలు, వాహనాల, కొరతగా ఉండటంతో లోడింగ్ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, ధాన్యం తరలించిన లారీలు మిల్లులలో ధాన్యం బస్తాలు దింపుకోవడం లేదని దీంతో ఒక్కో మిల్లు వద్ద పదుల సంఖ్యలో లారీలు ధాన్యం బస్తాలతో రెండు, నుండి మూడు రోజుల పాటు నిలిచి పోతుండడంతో లారీల కొరత ఏర్పడిందని నిర్వాహకులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ రైతులు ససేమిరా అంటూ భీష్మించి కూర్చుండడంతో ఈవిషయం తెలుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా రోడ్డుపై బైఠాయించడంతో స్థానిక తహసీల్దార్‌కు ఎస్ఐ ఫోన్‌లో విషయం తెలుపడంతో లారీలు కేంద్రానికి సమకూర్చుతానని తెలుపడంతో శాంతించిన రైతులు నిరసనను విరమించడంతో ఇరుప్రక్కల నిలిచిపోయిన వాహనాలను పోలీసులు పంపించి రోడ్డును క్లియర్ చేశారు. కాగా రోడ్డుపై రైతులు గంటకుపైగా రాస్తారోకో చేసినా, తహసీల్దార్ రాకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తాయి.